
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 26 జూలై 2024
5







సంక్షేమ పద్దు...



ఇష్టం కొంచెం కష్టం

వ్యవసాయ రంగానికి అత్యధిక బడ్జెట్

మంత్రి తుమ్మల



ఖమ్మం, (ఆంధ్రజ్యోతిప్రతినిధి) జూలై 25: దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేటాయించని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72,657కోట్లు నిధులు కేటాయింపులు జరిపిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కితాబునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాత్రి ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ప్రకటించిన మేరకు... రాష్ట్రంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, ఉచిత పంటలబీమాతో పాటు రైతు సంక్షేమం కోసం ఎన్నో హామీలు ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఆ హామీలను అమలు చేసే విధంగా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించిందని తెలిపారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వంగా రైతులకు భరోసాగా ఉంటుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ - 2024-25లో రైతులు, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారు. సంక్షేమంలో భాగంగా ఇప్పటికే అమలులో ఉన్న ఆరు గ్యారెంటీ పథకాలను నిధులు కేటాయించారు. సత్వర పనులు, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో ఆయా రంగాలకు నిధులు కేటాయించారు. ఎన్నికల హామీ మేరకు నియోజకవర్గాలకు భారీగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు చేయనున్నారు. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మాత్రం ఆశించిన రీతిలో కేటాయింపులు జరగలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

- సీతారామ ఎత్తిపోతలకు రూ.799.43 కోట్లు
- సీతమ్మసాగర్ ముచ్చటే లేదు...
- భద్రాచల రామాలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులేవీ?
- భక్తరామదాసు ఎత్తిపోతల నిర్వహణకు రూ.5 లక్షలు
- ఎకో టూరిజం ప్రాంతాలుగా కనకగిరి గుట్టలు, కిన్నెరసాని అభయారణ్యం
- సత్వర పనులు, సంక్షేమానికే అగ్ర ప్రాధాన్యం
- ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక నిధులు
- రైతులు, మహిళలకు వరాలు
- రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు కేటాయింపుల తీరు...



వ్యవసాయానికి పెద్దపీట

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యానశాఖకు రూ.737కోట్లు, పశుసంవర్థక శాఖకు రూ.1,980 కోట్లు కేటాయించారు. వీటితో పాటు రూ.2లక్షల రైతు రుణమాఫీకి బడ్జెట్‌లో గ్యారంటీ ఇవ్వడంతోపాటు నిధులు కేటాయించారు. ఖమ్మం జిల్లాలో సుమారు 3లక్షల 73వేల మంది, భద్రాద్రి జిల్లాలో 2లక్షల మంది రైతులు లబ్ధిపొందనున్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులక్ష్యంగా పెట్టుకోగా ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో కొత్తగా ఆయిల్‌పాం సాగులోకి రానుంది. బడ్జెట్‌లో రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించింది. సన్నరకం ధాన్యం పండించే రైతులకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో వరి పండించే రైతులకు మేలు జరగనుంది. జిల్లాలో సన్నరకం ధాన్యం సుమారు లక్ష మెట్రిక్ టన్నుల మేర పండుతోంది.

రెండుచోట్ల ఎకో టూరిజం అభివృద్ధి



రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో ఎకోపర్యాటక అభివృద్ధికి కొన్ని అరణ్యప్రాంతాలను ఎంపికచేశారు. అందులో ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, తల్లాడ, పెనుబల్లి, కల్లూరు మండలంలోని కనకగిరి గుట్టలను, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి కిన్నెరసాని అభయారణ్యాన్ని గుర్తించారు. ఈ రెండు ప్రాజెక్టులను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తద్వారా కనీస సౌకర్యాలు లేని ఈ రెండు అటవీ ప్రాంతాలకు పర్యాటక సొబగులు రానున్నాయి.



గృహనిర్మాణానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గృహనిర్మాణానికి ప్రాధాన్యత కల్పించింది. సొంత స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు మంజూరు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు కేటాయించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 35వేల ఇందిరమ్మ ఇళ్లు జిల్లాలో నిర్మించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి.

ఐటీఐలో స్వయం ఉపాధికి అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రభుత్వ ఐటీఐల్లో టాటా కంపెనీ అనుసంధానంతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం మెరుగుపరచనుంది. దీని కింద ఉమ్మడిజిల్లాలో టేకులపల్లి, రుద్రంపూర్, కృష్ణసాగర్, మణుగూరు ఐటీఐలు ఎంపికయ్యాయి వీటిలో అధునాతన పరికరాలు ఏర్పాటు చేసి విద్యాబోధన చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐల్లో స్కిల్ డెవలప్‌మెట్‌లకు బడ్జెట్‌లో రూ.300కోట్లు కేటాయించారు.



ఆరు గ్యారంటీలకు నిధులు

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. అందులో భాగంగా గృహజ్యోతికి రూ.2,418 కోట్లు, గ్యాస్ సబ్సిడీకి రూ.733 కోట్లు కేటాయించారు. గృహజ్యోతి కింద భద్రాద్రి కొత్తగూడెంలో 1,56,000 కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఖమ్మం జిల్లా పరిధిలో 2,18,907 కుటుంబాలకు లబ్ధిచేకూరనుంది. గ్యాస్ సబ్సిడీలో ఖమ్మం జిల్లాలో 2,16,000 మంది లబ్ధిపొందుతున్నారు.

మౌలిక సదుపాయాలకు కేటాయింపులు

రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్యం, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు పెద్దఎత్తున నిధులు కేటాయించారు. జిల్లాలో రహదారుల అభివృద్ధి, ఖమ్మంలో అధునాతన మార్కెట్, ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలు, పాలేరు మద్దులపల్లి జేఎన్‌టీయూ కళాశాల భవనాలకు నిధులు ఆయా శాఖల, యూనివర్శిటీల పరంగా కేటాయింపులు చేయనున్నారు. జమలాపురం, భద్రాచలం ఆలయాలకు కూడా దేవాదాయశాఖ పరంగా నిధులు కేటాయింపులు చేయనున్నారు.



సీతారామకు రూ.799.43కోట్లు

ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. కాలువలు, లిఫ్టుల కోసం రూ.687.81 కోట్లతో పాటు ఏపీపీ పనుల కోసం అదనంగా రూ.111.62 కోట్లు కేటాయించారు. సీతారామ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.7,500కోట్లు ఖర్చు చేశారు. అయితే సీతమ్మసాగర్‌కు మాత్రం కేటాయింపుల విషయంలో స్పష్టత ఇవ్వలేదు. సీతమ్మసాగర్ నిర్మాణం విషయంలో కేంద్ర పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అభ్యంతరాలున్నాయి. ఇవి పరిష్కారమైన తరువాతనే సీతమ్మసాగర్‌కు కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. అలాగే పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న భక్తరామదాసు ఎత్తిపోతల పథకం నిర్వహణకు రూ.5లక్షలు కేటాయించారు. నీటిపారుదల శాఖకు బడ్జెట్‌లో రూ.22,301 కోట్లు కేటాయించారు.

మహిళా సంక్షేమానికి ఊతం



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మహిళ సంక్షేమానికి ఊతమిచ్చారు. ఇందుకోసం ఇందిరమ్మ మహిళ శక్తి పథకం పేరుతో డ్వాక్రా సంఘాల మహిళలకు వృత్తినైపుణ్యం, శిక్షణ, రుణాలు కేటాయింపు జరగనుంది. డ్వాక్రా రుణం తీసుకున్న మహిళ మరణిస్తే రూ.2 లక్షల రుణ మాఫీ చేయనున్నారు. ఎవరైనా మహిళలు ప్రమాదవశాత్తు చనిపోతే వారికి రూ.10లక్షల బీమా చెల్లించనున్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 612 గ్రూపులు, వైరాలో 550, సత్తుపల్లి 540, మధిరలో 576 డ్వాక్రా గ్రూపులున్నాయి. ఖమ్మం గ్రామీణాభివృద్ధి పరిధిలో 25,060 గ్రూపులున్నాయి. భద్రాద్రి జిల్లాలో 3,560 గ్రూపులున్నాయి.

పంచాయతీలకు పక్కా భవనాలు



రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్‌లో రూ.29,816 కోట్లు కేటాయించారు. ఇందులో భవనాలు లేని పంచాయతీలకు పక్కాభవనాలు నిర్మించనున్నారు. ఉమ్మడి జిల్లాలో గిరిజనతండాలను గత ప్రభుత్వం పంచాయతీలుగా ప్రకటించినా ఇప్పటివరకు భవనాలు నిర్మించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా పంచాయతీలకు కొత్తభవనాలతో పాటు మండల కేంద్రాలకు బీటీ రోడ్లకు హామీ ఇచ్చింది. భద్రాద్రి జిల్లాలో 286 పంచాయతీలకు భవనాలు లేవు. ఇందులో కొన్ని ఐటీడీఏ నిధుల ద్వారా పనులు ప్రారంభించారు. ఖమ్మం జిల్లా పరిధిలో 147 పంచాయతీలకు భవనాలు లేవు. 69 పంచాయతీలకు భవనాలు నిర్మిస్తుండగా మిగిలిన వాటికి బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నారు.

ఆదర్శవంతమైన బడ్జెట్

పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు



రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సముచిత స్థానం కల్పించారు. వ్యవసాయ, పారిశ్రామిక, ఇతర రంగాలకు కావాల్సిన మేరకు ఆర్థికంగా తోడ్పాటును కల్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా ఆ ప్రభావం రాష్ట్ర ప్రజలపై భారం పడకుండా సరైన ఆర్థిక కార్యాచరణ చేశారు. ఇది అన్ని వర్గాలకు ఆమోద యోగ్యమైన బడ్జెట్.

సంతృప్తికరమైన బడ్జెట్

పోటు ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి



రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ, వ్యవసాయ రంగాలకు కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయి. సంక్షేమానికి రూ.40వేల కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.72,669 కోట్లు కేటాయించటం హర్షనీయమే. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం జరగకపోయినా రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగాన్ని ఆదుకున్నారు.

ఇరిగేషన్, విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు లేవు

నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి



ఇరిగేషన్, విద్య, వైద్య రంగాలకు సరైన నిధులు కేటాయింపులు జరగలేదు. ప్రతిష్ఠాత్మకమైన సీతారామా ప్రాజెక్టుకు అరకొరగా నిధులు కేటాయించారు. 2030నాటికి కూడా ప్రాజెక్టు పూర్తి కాదు. ఉచిత విద్య, వైద్యం అందేలా కార్యాచరణ లేదు. సంక్షేమ రంగానికి గతంలో కంటే కేటాయింపులు పెరిగాయి. రైతులు, కూలీలకు కేటాయించిన నిధులు సరిపోవు. రాష్ట్ర మంత్రులు చెప్పిన మాటలకు రూపొందించిన బడ్జెట్‌కు పొంతన లేదు.

ఎన్నికల హామీలను నెరవేర్చే విధంగా లేదు

జి.వెంకటేశ్వరరావు, మాస్‌లైన్‌జిల్లా కార్యదర్శి



ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చే విధంగా రాష్ట్ర బడ్జెట్ లేదు. పెన్షన్ల పెంపునకు, మహాలక్ష్మి పథకాలకు నిరుద్యోగ భృతి, విద్యా, వైద్యరంగాలకు తగిన కేటాయింపులు బడ్జెట్‌లో లేవు. ఆదాయం పెంచుకోవటానికి మద్యం అమ్మకాలకు ప్రాధాన్యం కల్పించారు. ఉద్యోగుల బకాయిలు, పీఆర్సీ ప్రస్తావన లేదు. గత అప్పులను ఏకరువు పెడుతూ కొత్త అప్పుల కోసం వెంపర్లాడినట్లుగా ఉంది.

భద్రాచలం వద్ద గోదావరి వరద



పెరుగుతూ.. తగ్గుతూ...

- భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం తీరు
- మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- ప్రస్తుత నీటిమట్టం 48.6 అడుగులు

భద్రాచలం, జూలై 25: ఎగువన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం అర్ధరాత్రి నుంచి క్రమంగా పెరిగింది. బుధవారం రాత్రి 9 గంటలకు 45 అడుగులున్న గోదావరి నీటిమట్టం కొద్దిసేపు నిలకడగా ఉండి 11 గంటల నుంచి పెరగడం ప్రారంభించింది. బుధవారం అర్ధరాత్రి 12గంటలకు 45.3 అడుగులకు పెరగ్గా గురువారం ఉదయం 6 గంటలకు 46.6 అడుగులకు చేరుకుంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.10కు 48 అడుగులకు పెరగడంతో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 6గంటలకు 48.6 అడుగులకు చేరుకుంది. కాగా ఈ స్థాయిలో గోదావరి కొంతసేపు నిలకడగా ఉండి తరువాత తగ్గుముఖం పడుతోందని అధికారులు తెలిపారు. ఎగువన వర్షాలు లేకపోవడంతో వరద పెరగకపోవచ్చని వారు తెలిపారు. గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు అత్యవసర సేవలకు కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని కలెక్టరు సూచించారు.

కేసు నమోదుకూ ముడుపులు అడిగాడు...

- ఏసీబీ వలలో పాల్వంచ టౌన్ ఎస్ఐ బాణాల రాము
- రూ.20వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- స్వయంగా పట్టించిన క్లయింట్ తరపు న్యాయవాది కడప లక్ష్మారెడ్డి
- పాల్వంచలో సంచలనం... ఎస్ఐపై గతంలోనూ ఆరోపణలు



ఏసీబీకి పట్టుబడిన పాల్వంచ టౌన్ ఎస్ఐ బాణాల రాము

పాల్వంచ, జూలై 25 : ఆయన ఓ ఎస్ఐ.. కోర్టు ఆదేశిస్తే గాని కేసు నమోదు చేయలేదు... అయినప్పటికీ అందులోనూ ప్రతిఫలం ఆశించాడు. పిటీషనర్ నుంచి డబ్బులు డిమాండ్ చేశాడు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పిటీషనర్ తరపు న్యాయవాది ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు లంచం తీసుకుంటుండగా సదరు ఎస్ఐని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో గురువారం చోటుచేసుకుంది.

ఏసీబీ అధికారులు, బాధితుల కథనం ప్రకారం... పాల్వంచ గట్టాయిగూడేనికి చెందిన సీరపు శ్రావణి అనే మహిళ నుంచి కొత్తగూడేనికి చెందిన బాలసాని గణేష్ కొంత నగదు అప్పుగా తీసుకుని మృతిచెందాడు. దీంతో శ్రావణి కోర్టును ఆశ్రయించగా గణేష్‌కు చెందిన ఆస్తిపై అటాచ్‌మెంట్ ఆర్డర్ జారీ అయింది. అయినప్పటికీ పాల్వంచకు చెందిన ఇద్దరు వ్యక్తులు గణేష్ ఆస్తిని ఉద్దేశపూర్వకంగా అతడి వారసులైన ముగ్గురి వద్ద కొనుగోలు చేసి అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలిసిన శ్రావణి రిజిస్ట్రేషన్ చేసిన వారిని, చేయించుకున్న వారిని సంప్రదించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పైగా ఆమెను వారందరూ బెదిరించడంతో పాల్వంచ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కానీ ఎస్ఐ బాణాల రాము ఆమె ఫిర్యాదును పక్కన పడేశాడు. ఎంతకూ కేసు నమోదు చేయకపోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాడు.

అయితే కేసు నమోదు చేసినందున తనకు డబ్బులిప్పించాలని శ్రావణి తరపు న్యాయవాది కడప లక్ష్మారెడ్డిని ఎస్ఐ రాము ఒత్తిడి చేయడం ప్రారంభించాడు. దీంతో న్యాయవాది ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు అన్ని విషయాలు ధ్రువీకరించుకున్న తర్వాత స్కెచ్ వేశారు. వారి సూచనల మేరకు న్యాయవాది లక్ష్మారెడ్డి గురువారం పాల్వంచలోని శాంతి థియేటర్ పక్కన ఉన్న ఎస్ఐ నివాసానికి వెళ్లాడు. ఈ సందర్భంగా ఎస్ఐ రాము మళ్లీ డబ్బుల విషయం ప్రస్తావించగా, న్యాయవాది తన వద్దనున్న రూ.20 వేల నగదును ఆయనకు అందించాడు. అయితే అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు వెంటనే వచ్చి ఎస్ఐని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఇంట్లో సోదాలు నిర్వహించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు.

ఇదిలా వుండగా, ఎస్ఐ రాముపై గతంలోనూ పలు ఆరోపణలున్నాయి. ఖమ్మంలో పనిచేస్తుండగా కోర్టు ఆదేశాలు లేకుండా ఓ ఎఫ్ఐఆర్‌ను మార్చి, నిందితులకు అనుకూలంగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశాడని ఫిర్యాదులు వచ్చాయి. ఈ వ్యవహారంలో సదరు ఎస్ఐనికొంతకాలం వీఆర్‌లో ఉంచారని తెలిసింది. అలాగే సత్తుపల్లిలో పనిచేస్తుండగా ఎస్ఐ రాముపై ఓ కానిస్టేబుల్ స్వయంగా కేసు పెట్టాడని, ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది.



అశ్వారావుపేటలో స్వీపర్ పాదాలు కడుగుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి దంపతులు

స్వీపర్ పాదాలు కడిగిన ఎంపీపీ

- అతి తక్కువ వేతనమైనా విలువైన సేవలందించిందని కితాబు
- పాలకవర్గం పదవీకాలం ముగింపు సందర్భంగా అశ్వారావుపేటలో ఆసక్తికర సన్నివేశం

6

15 నుంచి బీఎస్ఎన్ఎల్ 4జీ

- మారుమూల ప్రాంతాలకూ అందుబాటులో...
- గ్రామీణ ప్రాంతాల్లో రూ.3వేల విలువైన మోడెం ఉచితం
- కొత్తగా 47టవర్స్ నిర్మాణం : డీజీఎం శ్రీనివాసరావు

6

కలెక్టరేట్‌లో వైద్య శిబిరం

- వైద్య పరీక్షలు చేయించుకున్న కలెక్టర్, ఉద్యోగులు
- ఉద్యోగులకు హెల్త్ ప్రొఫైల్
- ఆరోగ్యాన్ని జాగ్రత్తగా పరిరక్షించుకోవాలన్న కలెక్టర్

6

శిథిల భవనాలకు చెక్

- నగరంలో కూల్చివేతలకు కేఎంసీ శ్రీకారం
- వందేళ్ల నాటి పోస్టాఫీస్ భవనం నేలమట్టం
- నగరంలో 15 పాత భవనాల గుర్తింపు

అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడి మృతి

మణుగూరు, జూలై 25: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఓసీ2 గని లో జనరల్ మజ్దూర్‌గా పనిచేసే కార్మికుడు గుగులోత్ నగేష్ (43) అనుమానస్పద స్థితిలో బుధవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చాతి నొప్పిగా ఉందని నగేష్ తెలుపడంతో కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకునే లోపే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా గురువారం నగేష్ తమ్ముడు లక్ష్మణ్ ఇతర కుటుంబ సభ్యులు నగేష్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మణుగూరు పోలీసులు అనుమాస్పద మృతికింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య దేవిశ్రీ ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


నగేష్ (ఫైల్)

యువకుడి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి, జులై 25: మండలంలోని గుంపెన పంచాయతీలోని కట్టుగూడెం గ్రామానికి చెందిన మునగాల అశోక్(33) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం అప్పుల బాధ భరించ లేక మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

మంత్రి తుమ్మల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఆయిల్‌ఫెడ్ చైర్మన్


తుమ్మల ఆయిల్‌పాం తోటలను పరిశీలిస్తున్న చైర్మన్ రాఘవరెడ్డి

దమ్మపేట, జూలై 25: లింగాలపల్లి, గండుగులపల్లి గ్రామాలలోని వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పామాయిల్ వ్యవసాయక్షేత్రాలను ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం అధికారులతో కలిసి సందర్శించారు. పామాయిల్ సాగులో అంతరపంటలుగా సాగువుతున్న వక్క, కోకో, జాజికాయ తదితర పంటలను పరిశీలించారు. సేంద్రియసాగు విధానాన్ని దిగుబడులను, అంతర పంటల దిగుబడులను ఆయిల్‌ఫెడ్ అధికారులు చైర్మన్‌కు వివరించారు. భద్రాద్రి జిల్లాలో వ్యవసాయ భూములు పామాయిల్ సాగుకు అనుకూలంగా వుండటంతో దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. ఎక్కువ మంది రైతులు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారని దీనివల్ల ఖర్చు తక్కువ కావటంతో పాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయని అధికారులు వివరించారు. తమ్మల సాగు చేసే విదానాన్ని ఆయనకు వివరించారు.

నర్సింహస్వామి ఆలయంలో పూజలు చేసిన చైర్మన్

గొర్రెగుట్ట గ్రామంలోని స్వయంభూ నర్సింహస్వామి ఆలయంలో చైర్మన్ రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. ఆయనవెంట అధికారులు జనరల్ మేనేజర్ సుధాకరరెడ్డి, ప్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, అప్పారావుపేట, అశ్వారావుపేట ప్యాక్టరీ మేనేజర్లు కళ్యాణ్, నాగుబాబు, సిబ్బంది, రైతులు నాగప్రసాదువున్నారు.

ఉమ్మడి జిల్లాలో 15నుంచి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు


మధిరలో బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డీజీఎం, అధికారులు

మధిర, జూలై 25: మధిరలో ప్రైవేట్ మొబైల్ నెట్ సేవలకు ధీటుగా బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వైఫై సేవలను ప్రారంభించింది. గురువారం మధిరలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద సంస్థ డీజీఎం శ్రీనివాసరావు ఈ మేరకు సేవలను ప్రారంభించి సిబ్బందితో కలిసి బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 15 నుంచి 436 టవర్స్ ద్వారా 4జీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.3వేల విలువచేసే మోడెం ఉచితంగా అందజేస్తామన్నారు. నెలకు రూ.399 ప్లాన్‌తో ప్రారంభమయ్యే వైర్లెస్ ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకున్నవారికి హైస్పీడు మోబైల్‌తోపాటు 250 టీవీ చానల్స్, లాండ్ లైన్ ఫోన్ అందిస్తామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 436 టవర్లను ఆగస్టు 15నుంచి దేశీయంగా రూపొందించిన పరిజ్ఞానంతో 4జీ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఏ మొబైల్ నెట్ వర్క్‌పనిచేయని మారుమూల ప్రాంతాల్లో కూడా బీఎస్ఎన్ఎల్ సేవలను అందించేందుకు ఉమ్మడి జిల్లాలో కొత్తగా 47టవర్స్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఏ ప్రైవేట్ మొబైల్ నెట్‌వర్క్ ఇవ్వని విధంగా రూ.147లకే అన్‌లిమిటెడ్ కాల్స్ , 20జీబీ డేటాతో నెలరోజులు సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం బీఎస్ఎన్ఎల్ ఏజీఎం కె రామ్‌కుమార్, సబ్ డివిజనల్ ఇంజనీర్ జీ ప్రసాద్‌రావు, మధిర జేటీవో శ్రీకాంత్, దనేకుల అన్వేష్, ఆదిత్య కిరణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

శిథిల భవనాలకు చెక్

▸▸ ఖమ్మం నగరంలో కూల్చివేతలకు కేఎంసీ శ్రీకారం ▸▸ వందేళ్ల నాటి పోస్టాఫీస్ భవనం నేలమట్టం


పాత హెడ్‌పోస్టాఫీస్ భవనాన్ని కూల్చివేస్తున్న అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 25: శిథిలావస్థలో ఉన్న పాతభవనాలు వర్షాకాలంలో కూలే ప్రమాదం ఉన్న దృష్ట్యా వాటిని గుర్తించి కూల్చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు నగరంలోని శ్రీనివాసనగర్ సమీపంలోని పాత హెడ్‌పోస్ట్ ఆఫీస్ భవనాన్ని జేసీబీతో కూల్చివేశారు. 100 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దానిని కూల్చివేయాలని నగరపాలక సంస్థ అధికారులు తపాలశాఖ అధికారులకు రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటంతో సదరు శిథిల భవనాన్ని కూల్చివేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉత్తర్వులు జారీ చేయటంతో గు రువారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర, టీపీఎస్‌లు ఇటికాల భాస్కర్, నరేష్, సంతోష్ పమ్మి వెంకటేశ్వర్లు పోలీసు బందోబస్తుతో శిథిలావస్థలో ఉన్న పాత హెడ్‌పోస్టాఫీస్ భవనాన్ని కూల్చివేశారు. కాగా, నగరంలో శిథిలావస్థలో ఉండి ప్రమాదకరంగా ఉన్న మరో 15 భవనాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. వాటి వివరాలను ఇంజనీరింగ్ విభాగానికి పంపించారు. ఇంజనీరింగ్ అధికారులు సదరు భవనాల పరిస్థితిపై నివేదిక ఇవ్వగానే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుంధర తెలిపారు.

స్వీపర్ పాదాలు కడిగిన ఎంపీపీ

అశ్వారావుపేట, జూలై 25: అశ్వారావుపేట ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగంతో వ్యవహరించారు. కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న కుమారి అనే మహిళకు అరుదైన గౌరవం ఇచ్చారు. ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి ఆమె పాదాలను స్వయంగా కడిగి పాదపూజ చేశారు. ఆమె సేవలను కొనియాడారు. అతి తక్కువ వేతనం వస్తున్నా కుమారి కార్యాలయాన్ని అంటిపెట్టుకొని పరిశుభ్రంగా ఉంచారని, ఆమెకు తానెప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. అలాగే తనకు ఐదేళ్లపాటు సహాయకుడిగా పనిచేసిన సాయికుమార్ దంపతులను శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... వ్యాపార రంగంలో ఉన్న తాను ఎంపీపీగా గెలిచి ప్రజలకు సేవ చేసే అవకాశం పొందడం పూర్వజన్మ సుకృతమని అన్నారు.

ఈ సందర్భంగా ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్యవైశ్య సంఘం, వ్యాపార వర్గాలకు చెందిన వ్యక్తులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంకా ప్రసాదరావు తదితరులు పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ఎంపీపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, జడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి, ఎస్.శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు దేవరాజ్, జెకెవి రమణారావు, నార్లపాటి రాములు, కోటగిరి సీతారామస్వామి, తాడేపల్లి రవి, ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధిరలో ద్విచక్రవాహనాల చోరీలపై నిఘా

▸▸ ఆరు వాహనాలకు గాను ఐదు వాహనాల రికవరీ


ఓ షోరూమ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సంధ్య

మధిర, జూలై 25: మధిర పట్టణ పరిధిలో ఇటీవల కొంత కాలంగా జరుగుతున్న ద్విచక్రవాహనాల చోరీలపై పట్టణ పోలీస్ శాఖ నిఘా పెట్టి ఫలితాలు సాధించింది. ఇప్పటి వరకు పలు ప్రాంతాల్లో ఇళ్ల ముందు, దుకాణాల వద్ద పెట్టిన ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. పలు ప్రాంతాల్లో చోరీ సంఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అయినా నేరాలు ఆగకపోవడంతో పోలీస్ శాఖ పనితీరుపై పలు విమర్శలు వినిపించాయి. ఈ క్రమంలో టౌన్ ఎస్ఐ సంధ్య ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో నెలరోజుల వ్యవధిలోనే 6వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈమేరకు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు రావడంతో పలువురు నేరగాళ్లపై నిఘా పెట్టారు. చోరీకి గురైన ఆరు ద్విచక్ర వాహనాలల్లో, 5 వాహనాల చోరీ ఆచూకీ కనిపెట్టినట్లు సమాచారం. ఇంకా ఒక ద్విచక్ర వాహనం చోరీ కనిపెట్టాల్సి ఉంది.

అయితే పోలీసులకు ఫిర్యాదు చేసిన వాహనాలు కాకుండా, ఇంకా కొన్ని వాహనాలు చోరీ జరిగాయని సమాచారం. కొంతమంది తమ వాహనాలు చోరీ అయిన విషయం పోలీసులకు పిర్యాదు చేయలేదని తెలుస్తోంది. ఇందుకు ముఖ్యంగా పాత వాహనాల వారు వారివద్ద బండి కాగితాలు సరిగా లేకపోవడం, ఉన్నా అందుబాటులో లేకపోవడంగా తెలుస్తోంది. ఏదైనా పోలీసులకు ఫిర్యాదులు వచ్చిన వాహనాల రికవరీకి పోలీస్ శాఖ చర్యలు చేపట్టారు.

దొంగ వాహనాలు కొన్నా, అమ్మినా చర్యలు

● టౌన్ ఎస్ఐ సంధ్య

ద్విచక్రవాహనాల చోరీ దర్యాప్తులో బాగంగా టౌన్ ఎస్ఐ సంధ్య గురువారం మధిర పట్టణంలోని పలు సెకండ్ హ్యాండ్ షో రూంలను తనిఖీ చేశారు. ఒక షోరూంలో 37 బండ్లు, మరొక షోరూంలో 35 బండ్లు సెకండ్ హ్యాండ్ వాహనాలు ఉండగా, వాటిని పరిశీలించారు. వీటి కాగితాలను పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏదైనా దొంగ వాహనం ఉంటే షోరూం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణే సింగరేణి లక్ష్యం

▸▸ కొత్తగూడెం ఏరియాలో భారీగా మొక్కలు నాటిన సింగరేణి అధికారులు



గౌతంఖని ఓపెన్‌కాస్టు వద్ద మొక్కలు నాటిన సింగరేణి డైరెక్టర్ (పా) శ్రీనివాస్

కొత్తగూడెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సింగరేణి శ్రమిస్తుందని సింగరేణి డైరెక్టర్ (పా) ఎంవీకే. శ్రీనివాస్ తెలిపారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. గురువారం వృక్ష రోపన్ అబియానణ్ 2024 కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని గౌతంఖని ఓపెన్‌కాస్టులో మొక్కలు నాటారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతున్నప్పటికి దానిని నిర్మూలించేందుకు సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పని చేస్తుందన్నారు. డీఎఫ్‌వో కృష్ణగౌడ్ మాట్లాడుతూ అడవుల్లో వన్యప్రాణులు తిరిగే వాతావరణాన్ని కల్పించేవిధంగా మొక్కలు పెంచాలన్నారు. సింగరేణి యాజమాన్యం ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు, అధికారులు కోటేశ్వరరావు, గణపతి, వివేక్‌బాబు,కోటిరెడ్డి, ఉమా, సుమలత, శివకేశవరావు, రమేష్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, ఎండి.రజాక్, కార్మికసంఘం నాయకులు గట్టయ్య, ఉపేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీలో బదిలీల సందడి


బదిలీపై వచ్చిన వారితో జిల్లా ఖజానాశాఖ అధికారి వెంటపల్లి సత్యనారాయణ

ఖమ్మంకలెక్టరేట్, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీలల్లో భాగంగా ఖమ్మం జిల్లా ఖజానా కార్యాలయంలో వివిధ విభాగాలలో అధికారులు, ఉద్యోగుల బదిలీలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో బదిలీపై వెళ్లిన వారిని, బదిలీపై కార్యాలయానికి వచ్చిన వారితో కార్యాలయంలో సందడి నెలకొంది. ఉద్యోగులకు అధికారులు శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో స్వాగతం, వీడ్కోలు చెప్పారు.

అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్స్ విభాగంలో

ఖమ్మం డీటీవోలో పనిచేస్తున్న టీ.కృష్ణ కుమారి మరిపెడకు బదిలీ అయ్యారు. డీటీవోగా కొత్తగూడెంలో పనిచేస్తున్న బి .రాంబాబు ఖమ్మానికి బదిలీపై వచ్చారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్స్ విభాగంలో సబ్‌ట్రెజరీగా వైరాలో పనిచేస్తున్న మోదుగు వేలాద్రి డీటీవో ఖమ్మంకు బదిలీ అయ్యారు. డీటీవోగా ఖమ్మంలో పనిచేస్తున్న ఎల్లయ్య సబ్‌ట్రెజరీ వైరాకు బదిలీ అయ్యారు. ఖమ్మం లో పనిచేస్తున్న కేడీఏ సాగర్-కొత్తగూడెం, కొత్తగూడెంలో పనిచేస్తున్న బి. నాగేంద్ర కుమార్‌కు ఖమ్మానికి, కొత్తగూడెంలో పనిచేస్తున్న టీ. వెంకటేశ్వర్లు మధిరకు, మధిరలో పనిచేస్తున్న అశోక్ రెడ్డి కొత్తగూడేనికి, నేలకొండపల్లిలో పనిచేస్తున్న ఎన్ వి. కృష్ణారావు ఇల్లెందుకు, ఇల్లెందులో పనిచేస్తున్న కృష్ణయాదవ్ వరంగల్‌కు బదిలీ అయ్యారు. నేలకొండపల్లికి మహబూబాద్‌లో పనిచేస్తున్న హఫీజ్ బదిలీపై వచ్చారు.

సీనియర్ అకౌంటెంట్ విభాగంలో

సాయి ప్రవీణ్-మరిపెడ, దుర్గ ప్రసాద్-రవీంద్రబాబు(వైరా)కు, వినయ్ కుమార్-మరిపెడ, కే. సంధ్యారాణి-మహబూబాద్, కే.శ్రీనివాసరెడ్డి-ఇల్లెందు, సౌజన్య-మధిర, సంగిరెడ్డి- అశ్వారావుపేట, ముర్తుజా హుస్సేన్-ఇల్లెందు, శ్రీనివాస్‌రెడ్డి- నేలకొండపల్లి, జూనియర్ అకౌంటెంట్ల విభాగంలో శోభారాణి నేలకొండపల్లికి బదిలీ అయ్యారు. ఆఫీస్ సబార్డినేట్స్ విభాగంలో స్వామి-వైరాకు బదిలీ అయ్యారు. జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ బదిలీలో వచ్చిన వారిని ఘన స్వాగతం పలికారు. బదిలీలో వెళ్లిన వారినీ రిలీవ్ చేశారు. బదిలీపై వెళ్లిన వారిని ఘనంగా సన్మానించారు.

నేటినుంచి ఎప్‌సెట్ రెండో విడత కౌన్సిలింగ్

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 24: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ రెండో విడత కౌన్సిలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది. 26న స్లాట్ బుకింగ్, 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 27, 28 తేదీలలో వెబ్ ఆప్షన్లకు అవకాశం, 31న సీట్ల కేటాయింపు జరగనుంది. మొదటి విడతలో సీట్లు రానివారు రెండో విడత కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు.

నేటినుంచి పాలీసెట్ స్పెషల్ అడ్మిషన్లు

పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, డిప్లొమా, టెక్నాలజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించే కౌన్సిలింగ్ శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. 26న స్లాట్ బుకింగ్, 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 27, 28 తేదీలలో ఆప్షన్లు, 31న సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూలై 31, ఆగస్టు 1న ఆన్‌లైన్లో పేమెంట్, సెల్ఫ్‌రిపోర్టింగ్, 2న కాలేజీలలో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 5, 6 తేదీలలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. ఈ కౌన్సిలింగ్ ఖమ్మం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వండి

▸▸ బ్యాంకు అధికారులకు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల ఆదేశం

కొణిజర్ల, జూలై 25: ప్రస్తుతం రుణమాఫీ అయిన రైతులకు కొత్తరుణాలను ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారిని విజయనిర్మల బ్యాంకు అధికారులకు తెలిపారు. గురువారం డీఏవో తనికెళ్ల, కొణిజర్లలోని ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకులను సందర్శించి రైతులతో, బ్యాంకు సిబ్బందితో మాట్లాడారు. రుణమాఫీ అయిన ప్రతీ రైతుకు నిబంధనల ప్రకారం వెంటనే కొత్తరుణాలు ఇవ్వాలని తెలిపారు. ఒకరిద్దరు రైతులతో మాట్లాడుతూ రుణమాఫీ పట్ల స్పందన అడిగి తెలుసుకున్నారు. రైతులంతా కూడ రుణమాఫీ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రుణమాఫీ అయిన రైతుల విషయంలో రైతులు బ్యాంకు అధికారులు సహకరించాలని వారికి పెట్టుబడుల నిమిత్తం కొత్తరుణాలు ఈనెల 30వ తేదీ వరకు ఇవ్వాలని తెలిపారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి బాలాజీ, ఆయా బ్యాంకు మేనేజరులు, ఏఈవో శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో విద్యార్థి అదృశ్యం

▸▸ కిడ్నాప్ జరిగినట్లు స్థానికంగా చర్చ ▸▸ విచారణ చేస్తున్న పోలీసులు


తనూష్ (ఫైల్)

ఇల్లెందు టౌన్, జూలై 25: భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణంలోని బీసీ బాలుర హస్టల్‌కు చెందిన విద్యార్థి అదృష్టమైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం చిన్నబంజరతండాకు చెందిన బానోత్ తనూష్ ఇల్లెందులోని బీసీ బాలుర హస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం హస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లేందుకు బయటకు వచ్చిన తనూష్ స్కూల్‌బ్యాగ్‌ను మధ్యలో వదిలేసి అదృశ్యమయ్యాడు. పాఠశాలకు వెళ్లకపోవడంతో సమాచారం తెలుసుకున్న వార్డెన్ రవి పాఠశాల పరిసరాల్లో విచారించగా అతడి స్కూల్ బ్యాగ్ లభించింది. బాలుడు అదృశ్యమైన విషయాన్ని తనూష్ తల్లిదండ్రులకు సమాచారం అందించగా తనూష్ ఇంటికి రాలేదని తెలపడంతో గురువారం ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా ముగ్గురు వ్యక్తులు తనూష్‌ను కిడ్నాప్ చేశారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

వైరా బస్టాండ్‌లో రెండుకిలోల గంజాయి పట్టివేత

వైరా, జూలై 25 వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సాయంత్రం అక్రమంగా రవాణా చేస్తున్న రెండు కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు అక్రమ గంజాయి రవాణా అవుతుందనే సమాచారం మేరకు వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో ఓబస్సులో సోదాలు నిర్వహించారు. బస్సు వెనుకభాగంలో అరకిలో చొప్పున ఉన్న నాలుగు గంజాయి ప్యాకెట్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నాగులవంచలో..

చింతకాని, జులై 25: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఓ ఇంట్లో ఉన్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఓ ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ నాగుల్‌మీరా ఆధ్వర్యంలో పోలీసులు ఆ ఇంటిని పరిశీలించగా పెరట్లో పెరుగుతున్న గంజాయి మొక్కను గమనించారు. ఇంటి లోపల తనిఖీలు చేయగా ఓ అట్టపెట్టెలో ఉన్న గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాయబ్ తహసీల్దార్ వీరభద్రనాయక్ సంఘటనా స్థలంలో పంచనామా నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని వైరా సీఐ సాగర్ పరిశీలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇతర ప్రాంతాలనుంచి గంజాయిని తీసుకవచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించినట్లు సమాచారం.

కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరం


ఖమ్మం కలెక్టర్ నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య శిబ్బంది

ఖమ్మం కలెక్టరేట్, జూలై 25: జిల్లాలో పనిచేస్తున్న ప్రభు త్వ ఉద్యోగులు, అధికారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్ రూపొందించారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అధికారులు, ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనపై కలెక్టర్ సూచనలు చేశారు. ప్రత్యేక వైద్య శిబిరంలో అవసరమైన మేర రిజిస్ట్రేషన్ కేంద్రాలు, శాంపిల్ కలెక్షన్ కేంద్రాలు, ఉద్యోగులు కన్సల్టేషన్ చేసేందుకు వీలుగా వైద్యులను అందుబాటులో ఉంచారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఉద్యోగికి వైద్యులు అవసరమైన పరీక్షలు చేశారు.. ఫలితాల ప్రకారం పాటించాల్సిన డైట్ వివరాలు, చేయాల్సిన మెడిటేషన్, తీసుకోవాల్సిన మందులపై వైద్య నిపుణులతో అవసరమైన సహకారం, సలహాలను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో తొలిరోజు 287 మంది పురుషులు, 140 మంది మహిళా ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 102 మందికి మధుమేహం, బీపీ పరీక్షలు, 85 మందికి ఈసీజీ నిర్వహించారు. 346 మందికి వివిధ పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు.ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ, తాము ఆరోగ్యవంతంగా ఉండేలా, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం వల్ల కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వైద్య పరీక్షల వలన వైద్య అధికారుల సూచనలతో భవిష్యత్‌లో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా, అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉంటూ, తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించగలుగుతామని అన్నారు. వైద్య శిబిరానికి కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీవో సన్యాసయ్యలు, అధికారులు, ఉద్యోగులందరూ వినియోగించుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. బి. మాలతి, డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఏజెన్సీలో పేలిన తూటా

▸▸ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి ▸▸ భద్రాద్రి, ములుగు జిల్లా సరిహద్దుల్లో ఘటన

కొత్తగూడెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి)/గుండాల: చాలా ఏళ్ల తర్వాత ఏజన్సీ ప్రాంతంలో తూటా పేలింది. మావోయిస్టులు, పోలీసుల మధ్య గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయి స్టు దళ నేత మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగు, ములుగు జిల్లా తాడ్వా యి మండలం అల్లిపెల్లి సరిహద్దుల్లో జరిగిన ఈ ఘటన కు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 28 నుంచి మావోయిస్టు వారోత్సవాలు నిర్వహించనున్న నేప థ్యంలో నాలుగు రోజులుగా గ్రేహండ్స్ బలగాలు నక్సలైట్ల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమం లోనే గురువారం తెల్లవారు జామున గుండాల మండలం దామరతోగుకు అనుకొని ఉన్న ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ మావోయిస్టు మృతి చెందాడు. మృతి చెందిన మావోయిస్టు భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన అశోక్(25) అలియాస్ విజేందర్‌గా పోలీసులు గుర్తించారు. మావోయిస్టు పార్టీ కమిటీకి చెందిన భద్రు, లచ్చన్నలతో పాటు మరో పదిహేను మంది దళ సభ్యులతో గుండాల-తాడ్వాయి అడవుల్లో సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో కూంబింగ్ నిర్వహిస్తుండగా జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి 303, ఎస్ఎల్ఆర్ ఆయుధాలను, మందుగుండి సామగ్రి, విప్లవ సాహిత్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మావోయిస్టుల నుంచి భద్రత కల్పిస్తామని ఎస్పీ రోహిత్ రాజ్ గురువారం భోరోసా ఇచ్చారు.

గుండాల సరిహద్దుల్లో చాలా ఏళ్ల తర్వాత...

గుండాల మండలంలో సింగన్న ఎన్‌కౌంటర్ అనంతరం న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన అజ్ఞాత దళ కమాండర్ లింగన్న 2019 జూలై 30న రోళ్లగడ్డ సమీపంలోని పంది గుట్ట వద్ద ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ఆ తర్వాత 2020 సెప్టెంబర్‌లో దేవళ్లగూడెం వద్ద మావోయిస్టు దళసభ్యుడు శంకర్ అలియాస్ దేవేందర్ పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. గత నాలుగేళ్లుగా ఈ ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి ఎన్‌కౌంటర్లు జరగలేదు. చాలా ఏళ్ల తర్వాత గుండాల ఏజెన్సీలో పోలీసు తూటా పేటడంతో గిరిజన గ్రామాలు తీవ్ర భయాందోళన చెందుతున్నాయి.



సత్తుపల్లి ఆర్‌అండ్‌బీ ఈఈగా తానేశ్వర్



సత్తుపల్లి, జూలై25: సత్తుపల్లి ఆర్‌అండ్‌బీ ఈఈగా జీ.తానేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నేళ్లపాటు ఇక్కడ ఈఈగా పని చేసిన ఎంబీహేమలత ఖమ్మం ఎస్‌ఈగా పదోన్నతిపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన తానేశ్వర్‌ను ఎస్‌ఈ హేమలత అభినందించగా ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, డీఈ సూరిబాబు, పెనుబల్లి, మధిర డీఈలు ఖలీల్, శంకరరావు, జేఈలు నాగేశ్వరరావు, ప్రకాష్, రవిచంద్ర, రాజేష్, కాంట్రాక్టర్లు సన్మానించారు. అయితే తానేశ్వర్ సత్తుపల్లి డీఈగా, ఖమ్మం ఎన్‌హెచ్ డీఈగా పనిచేసి మహబూబాద్‌కు ఈఈగా పదోన్నతిపై వెళ్లారు. అక్కడి నుంచి సత్తుపల్లికి ఈఈగా వచ్చారు.

మాఫీ రుణాలు వెంటనే మంజూరు చేయాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

» వీవీపాలెం సొసైటీ కార్యాలయం తనిఖీ

రఘునాథపాలెం, జూలై25: రుణమాఫీ జరిగిన రైతులకు తిరిగి వెంటనే రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం వీ వెంకటాయపాలెం సొసైటీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సొసైటీ పరిధిలో ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగింది అనే విషయాలను రికార్డులను తనిఖీలు చేసి పరిశీలించారు. రుణమాఫీపై రైతులు స్పందన ఏవిధంగా ఉందని బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించి తెలుసుకున్నారు. రైతు ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఎవ్వరికైనా రుణమాఫీ జరగకుంటే మరో విడతలో జరిగే ప్రక్రియను వివరించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 57,857 మంది రైతులు రుణమాఫీకి అర్హత పొందగా, ఇప్పటికే 51వేల మందికి డబ్బులు జమ జరిగాయని తెలిపారు. రైతురుణమాఫీ పథకంపై రైతులకు అందుబాటులో ఉంటూ వారికి ఏలాంటి అనుమానాలు ఉన్నా వాటిని వెంటనే నివృత్తి చేయాలని, బ్యాంకు అప్పులు, వడ్డీలపై రైతులకు వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఎల్‌డీఎం శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ మేనేజరు ఐతగాని తిరుపతిరావు, సూపర్‌వైజర్ జాన్‌మియా పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్లాట్ల బాధితులు

ఖమ్మంకలెక్టరేట్: స్వతంత్ర సమరయోధుల ప్లాట్లు సంబంధించిన లబ్ధిదారులు, కొసుగోలుదారులు గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిశారు. 25వ సంవత్సరాల క్రితం ఖానాపురం హవేలీ రెవెన్యూ పరిధిలో స్వతంత్ర సమరయోధులకు, ఎక్స్ ఆర్మీ కుటుంబాలకు 144 చదరపు గజాల చొప్పున అప్పటి ప్రభుత్వం ప్లాట్లను మంజూరు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో అది అటవీ ప్రాంతంగా ఉండటంతో చాలామంది వీటిని అమ్ముకున్నారు. తాము కొనుగోలు చేసుకున్న స్థలాకు తమకే అధికారాన్ని కల్పించాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వీరమేష్, రాజు, కృష్ణ, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, నరసింహారావు కమిటీ మెంబర్ పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సీజ్ చేసిన వాహనాలు అమ్మిన ఉద్యోగి

ఖమ్మంక్రైం, జూలై25: ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్‌గా పని చేసిన యువకుడు సీజ్‌చేసిన వాహనాలను యజమాని కళ్లుగప్పి అమ్మేశాడు. గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిం చినట్టు ఖమ్మం టూటౌన్‌సీఐ రామకృష్ణ తెలిపారు. నగరంలోని చర్చికాంపౌండ్‌కు చెందిన గుండా సాయి సందీప్ అనే యువకుడు ఓ ఫైనాన్స్ కంపెనీలో 2022 నుంచి రికవరీ ఏజెంటుగా విధులు నిర్వహిస్తున్నాడు. వాహనాలు కొనుగోలుచేసి ఈఎంఐ కట్టలేని పరిస్థితిలో ఉన్నవారి వద్దకు వెళ్లి వారి వాహనాలు రికవరీ చేసేవాడు. వాటిని ఇతరులకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలుచేసేవాడు. కొద్దిరోజుల తరువాత వాహన యజమానులు రికవరీ యార్డ్ వద్దకు వెళ్లగా వాహనాలు కనిపించలేదు. అనుమానం రాగా వాహనదారులు ఫైనాన్స్ కంపెనీ యజమానికి ఫిర్యాదు చేశారు. యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం యువకుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అతడి వద్ద నుంచి రూ.10 లక్షల విలువచేసే 45 ద్విచక్రవాహనాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై25: నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురిని గురువారం అన్నం శ్రీని వాసరావు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆస్సాంకు చెందిన ఆదిత్య మొండాను, సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పోలీస్ పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన పేమ్యాగానే అంజయ్యను, వైరా మండలం ముసలిమడు గు గ్రామానికి చెందిన ముత్త య్యను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విధులకు ఆటంకం: కేసు నమోదు

ఖమ్మంరూరల్, జూలై25: పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసునమోదైంది. మండల పరిధిలోని పెద్దతండా పంచాయతీ కార్యదర్శి సువర్ణ ఉమ గురువారం కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా పెద్దతండాకే చెందిన రవి, వాల్యా, రుక్మిణీ, మోహన్, పద్మ, వీరన్న పంచాయతీ కార్యాలయంలోకి వచ్చారు. పంచాయతీ కార్యదర్శితో దుర్భాషలాడి ఆమె విధులకు ఆటంకం కలిగించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

● పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జూలై25: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్‌ద త్ అన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రీవ్‌లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టి పెట్టుకుని అడిషనల్ డీసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి ఖమ్మం సమీపంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎక్క డికక్కడ పోలీసులు మొహరించి లారీడ్రైవర్లు, బస్సు, కారు డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. తని ఖీలో పట్టుబడిన సుమారు 55మందిపై కేసులు నమోదు చేసినట్టు సీపీ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లు డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌లతో రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణమన్నారు. ఆదేవిధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో ఆద్యులకు చేసేందుకు విజిబుల్ పోలీసింగ్ మరింత పకడ్బందీగా అమలు చేయాలని పోలీస్ అధికారులను సీపీ ఆదేశించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



వైరాజూలై 25: తాటిపూడి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వరప్రసాద్‌ను గురువారం సన్మానిం చారు. ఉద్యోగోన్నతిపై వెళుతుండటతో గ్రామస్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. రూ.10వేలు విలువచేసే వస్తువులను తనకు సహకారం అందించిన గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీఎంపీటీసీ కాంటారాజు, మాజీ సర్పంచ్ పెద్ద భద్రయ్య తాతా నిర్మల, హెచ్ఎం చింతనిప్పు విజయకుమారి పాల్గొన్నారు.

నలుగురు సూపర్‌వైజర్లు బదిలీ

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై25: మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలలోని పరిధిలోనిఅర్బన్ ప్రాజెక్టుకు సంబంధించి నలుగురు సూపర్‌వైజర్లు బదిలీ అయ్యారని ప్రాజెక్టు అధికారి కవిత గురువారం తెలిపారు. ఖమ్మం ద్వారకానగర్ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత మధిర ప్రాజెక్టుకు, నిజాంపేట సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి మధిరకు, ముస్తఫానగర్ సెక్టార్ సూపర్‌వైజర్ పుష్పలతను ఖమ్మంరూరల్ ప్రాజెక్టుకు, రఘునాథపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ కృష్ణ కుమారిని కామేపల్లి ప్రాజెక్టుకు బదిలీ చేసినట్టు తెలి పారు. వీరిస్థానంలో మరిపెడ నుంచి సీహెచ్ విజయ లక్ష్మి, కామేపల్లి నుంచి వెంకటమ్మ, మహబూద్ జిల్లా నుంచి వెంకటలక్ష్మిలను ఖమ్మంఅర్బన్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. వీరు గురువారం జిల్లామహిళ శిశుసంక్షేమ శాఖ కార్యాల యంలో రిపోర్టు చేశారు.

అగ్నిమాపకశాఖ అధికారిగా కృష్ణకుమార్

ఖమ్మంక్రైం: జిల్లాఅగ్నిమాపకశాఖ అధికారిగా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న కృష్ణకుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జయప్రకాశ్ గత కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌కు శిక్షణ నిమిత్తం వెళ్లారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ పోస్టుకు కృష్ణకుమార్ నియామ తులయ్యారు. ఖమ్మం ఏడీఎఫ్‌ఓగా ఉన్న రమేష్ బాబును జనగామ జిల్లాకు, ఖమ్మండివిజన్ అగ్ని మాపక శాఖ అధికారిగా ఉన్న రాజేశ్వరరావును కొత్తగూడెంకు బదిలీ చేశారు. ఖమ్మం డివిజన్ అగ్నిమాపకశాఖ అధికారిగా హనుమకొండలో పనిచేస్తున్న నాగరాజును నియమిం చారు. ఏడీఎఫ్ పోస్టును రద్దు చేశారు.

కోటమైసమ్మతల్లి ఆలయంలో దుకాణాల వేలం

కారేపల్లి,జూలై25:మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో గల కోటమైసమ్మతల్లి ఆలయంలో గురువారం వేలం పాట నిర్వహించారు. దసర పండగా సందర్భంగా నిర్వహించే వ్యాపారాల దుకాణాలకు అధికారులు వేలం నిర్వహించారు. దీంతో ఆలయానికి రూ.2లక్షల13వేలు ఆదాయం వచ్చింది. మిఠాయి విక్రయాలకు రూ.1.42 లక్షలు, మరమరాలు విక్రయాలకు 41వేలు, ఎన్‌క్రీములు విక్రయాలకు 30వేలకు పాటదారులు దక్కించుకున్నారు. మినిలి వాటికి త్వరలో వేలంపాటలు నిర్వహిస్తామని ఈవో వేణుగోపాలచార్యులు, సమత తెలిపారు.

వైరాలో భారీ చోరీ

రూ.15లక్షల వెండి వస్తువుల అపహరణ

వైరా,జూలై25: వైరా మునిసిపాలిటీ మూడోవార్డులోని సంత బజార్‌లో భారీ చోరీ జరిగింది. ప్రముఖ వ్యాపారి రంగా సత్యనారాయణ ఇంట్లో రూ.15లక్షల విలువైన 20 కిలోల వెండి వస్తువులను దొంగలు అపహరించుకుపో యారు. బుధవారం రాత్రి ఈ చోరీ జరిగినట్లు అనుమా నిస్తున్నారు. సత్యనారాయణ ఇంటికి తాళం వేసి కొన్నిరో జుల కిందట కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ లోని కూతురు ఇంటికి వెళ్లారు. అయితే ఇంటి, వెనుక భాగంలోని తలుపులు తెరిచి ఉండటంతో పరిసరాల్లోని నివాసాల వారు గమనించారు. వెంటనే ఆయనకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఆయన వైరాకు చేరుకుని పరిశీలించగా 20కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తేలింది. వెంటనే పోలీసులు ఫిర్యాదు చేశారు. వైరా ఎసీఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

ధరణి సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మంమామిళ్లగూడెం, జూలై25: ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, తద్వారా రైతులకు ప్రభుత్వం అందించేరుణమాఫీ, రైతు బంధుపథకానికి వాస్తవ అర్హులుగా చేర్చాలని టీడీపీ నాయకులు కేడీకేని హరీష్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం టీడీపీ నాయకులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనంతరం పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కేవృత్తి కొల్లు, పీ.నారాయణరావు, కే.విజయ్, వీ.బాబు తదితరులు పాల్గొన్నారు.

28న రాయల సంస్మరణ సభ

» మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై25: ఈనెల28న ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్మరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోకినేపల్లి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఐదుదశాబ్దాల పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అలుపెరుగని పోరాటం చేసిన విప్లవ యోధుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్(రమేష్‌న్న) అని గుర్తు చేశారు. కార్యక్రమానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు, కేజీ రామచందర్, గుమ్మడి నర్సయ్య కెచ్చల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఉప్పల ప్రభాకర్, ఎం కృష్ణ, చంద్ర అరుణ, పాయం చిన్న చంద్రన్న హాజరౌతారని ప్రకటించారు. ఉదయం 11గంటలకు సంస్మరణసభ, ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు జరుగు తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల అశోక్, సివై పుల్లయ్య, సీహెచ్ శిరోమణి, ఆవుల మంగతాయు, బండారు వెంకయ్య, టీ ఝాన్సీ, కేలోత్ లక్ష్మణ్, మందా సురేష్, మక్కా రవిందర్, జీ అశోక్ పాల్గొన్నారు.

రాయల సంతాపసభను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్: ఈనెల28న ఖమ్మంలో జరప తలపెట్టిన అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్ సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక నీలం అంజనేయ్య భవనంలో సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాటి రాజు, దుంపా రామయ్య, ఒగ్గు నాగిరెడ్డి, బలగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి గోకినేపల్లి

చెల్లని చెక్కు కేసులో 6నెలలు జైలు

ఖమ్మంలీగల్,జూలై25: ఖమ్మం బ్రాహ్మణ బజారుకు చెందిన చెల్లనిచెక్కు కేసులో నిందితురాలైన పాలవరపు శైలజకు శిక్ష విధించారు. మొదటి అదనపు ఆబ్కారీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి విధించిన ఆరునెలల జైలుశిక్షను ఖరారుచేస్తూ ఖమ్మం రెండవ అదనపు జిల్లా న్యాయాధి కారి వెంపటి అపర్ణ 6నెలలు జైలుశిక్ష, రెండు లక్షల యాభైవేలు చెల్లించాలని గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం సరితా క్లినిక్ ప్రాంతానికి చెందిన పిర్యాది శ్రీధర్ వద్ద నిందితురాలు 2017లో రెండు లక్షల యాభైవేల రూపాయలను తీసుకున్నారు. 2018లో రుణం చెల్లిం చేందుకు చెక్కు జారీ చేశారు. ఈ చెక్కును ఫిర్యాది తన బ్యాంకుఖాతాలో జమచేయగా నిరాదరణకు గురైంది. కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేయగా మద్య పాన ఆబ్కారీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి శాంతిలత కేసును విచారించారు. 2023లో నిందితురా లికి 6 నెలలు జైలుశిక్ష, రెండు లక్షల యాభైవేల రూపా యలను ఫిర్యాదికి చెల్లించాలని తీర్పుచెప్పారు. నిందితు రాలు జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోగా ఖమ్మం రెండో అదనపు జిల్లా న్యాయాధికారి కేసును విచారించి పై విధంగా తీర్పుచెప్పారు.

కోతుల దాడి: తీవ్రగాయాలు

కూసుమంచి,జూలై25: మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన కొన్నబోయిన రవి అనే యువకుడిపై కోతులు దాడి చేశాయి. ఇంటివద్ద చిన్న పిల్లలపై కోతుల గుంపు దాడిచేసేందుకు ప్రయత్నిస్తుండగా ఆ దుశ్యాన్ని చూసిన రవిపై దాడి చేశాయి. వెంటనే కుసు మంచి పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం ఖమ్మం తరలించారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు.. లక్ష్మీనారాయణ

సంస్మరణ సభలో సీపీఐ, సీపీఎం నేతలు భాగం, పోతినేని

కొణిజర్ల, జూలై25: ప్రజాసమస్యల పట్ల స్పందిస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేసి చిన్నవయస్సులోనే అకాలమరణం పొందిన గుబగుండ్ల వెంకటలక్ష్మీనారాయణ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ కొనియాడారు. మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన లక్ష్మీనారాయణ సంస్మరణ సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, సాబీర్‌పాషా, సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఆయా పార్టీ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, దొండపాటి రమేష్, వేములకొండ రమేష్, ఎంపీపీ గోసు మధు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీని రైతుల ఖాతాకు జమ చేయాలి

ఉద్యానవనశాఖ అధికారులకు రైతుసంఘం నాయకుల వినతి

కొణిజర్ల, జూలై25: పామాయిల్ రైతుల సబ్సిడీని వెంటనే రైతుల ఖాతాకు జమ చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. గురువారం ఉద్యానవనశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కొణిజర్ల, ఖమ్మంఅర్బన్, ఏన్కూర్ మండలాల్లోని పామాయిల్ రైతులకు ఉద్యానవనశాఖ అధికారులు సబ్సిడీ చెల్లించాలని కోరారు. రైతులు సాగు చేసిన కొన్ని తోటలకు కాపురావడంలేదని, రైతులకు సబ్సిడీని చెల్లించకుండా తిప్పుతున్నారని అధికారులు తెలిపారు. రైతులకు సబ్సిడీని అందించి తోటల సాగు పై ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతనిప్పు చలపతి, సంక్రాంతి నర్సయ్య, నవీన్‌రెడ్డి, ప్రతాపనేని కోటేశ్వరరావు, మందనపు రవీంద్ర, వేములపల్లి సుధీర్, నల్లమోతు శ్రీనివాసరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు లెనిన్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నేలకొండపల్లి,జూలై25: లెనిన్ తన జీవితకాల మంతా ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం రాత్రి గుండెపోటుతో అకాల మృతి చెందిన సీపీఎం నాయకుడు చావా లెనిన్ (53) అంత్యక్రియలు గురు వారం స్వగ్రామం మూటాపురంలో నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్య దర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర నాయకుడు భాగం హేమంతరావు, బీజేపీ జిల్లాధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కాంగ్రెస్ మండల నాయకులు గుడిమళ్ల మధు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతి నేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నివాళులర్పించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

కల్లూరు,జూలై 25: కల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం అంజలిరెడ్డి, కోటేశ్వరమ్మల జ్ఞాపకార్థంగా వారి కుమారులు ఎం శ్రీనివాస్, శైలాష్‌రెడ్డి కలిసి రూ.10వేల నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం నాగ వర్ధన, విశ్రాంత హెచ్‌ఎం నున్నా కృష్ణయ్య అందజేశారు.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్

కల్లూరు, జూలై25: వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని కల్లూరులో గురువారం దోమల నివారణ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. మదిరిరెడ్డి, ఏకలవ్యనగర్, శాంతినగర్‌లలోని ప్రధాన రహదారుల వైపున మురికిగా ఉన్న ప్రదేశాల్లో ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్, కార్యదర్శి నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ సామేల్, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిని అభినందించిన రాయల



ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై 25: రాష్ట్ర అభివృద్ధికి అనుకూలమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కలిసి అభినందించారు. హైదరాబాద్ లో భట్టిని కలిసిన రాయల పుష్ప గుచ్ఛం అందించారు. ప్రజలకు మానం పొందిన బడ్జెట్‌గా ఉందని రాయల పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పొట్ల నాగేశ్వరరావు వెంటున్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

తల్లాడ, జూలై25: కాచి చల్లార్చిన నీటినే తాగాలని మండల వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ సూచించారు. గురువారం తల్లాడ మండలంలోని క్రిష్ణాపురం, మిట్టపల్లి, అన్నారుగూడెం, మల్లవరం, కలకొడిమ, ముద్దునూరు గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు.

పాఠశాలలో భోజనం తనిఖీ

కారేపల్లి, జూలై25: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం తహసీల్దార్ ఎస్. సంపత్ కుమార్ భోజనం తనిఖీచేశారు. విద్యార్థినులతో మాట్లా డారు. పాఠశాలలోకి కోతులు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించాలి

సత్తుపల్లిరూరల్, జూలై25: సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడంలో విద్యార్థులు అంకితభావాన్ని ప్రదర్శిం చాలని ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ నూతన విద్యావిధానం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్‌లో భాగంగా సాంస్కృతిక దినోత్సవం గురువారం నిర్వహించారు. తమాషాలైనా అబద్ధాలు చెప్పకూడదని, నిజాలు మాట్లాడాలని, పెద్దల మాట చద్దిమూట అనే అంశాలతో ప్రదర్శించిన నాయనా పులి వచ్చింది అనే డ్రామాకు ప్రథమ బహుమతి లభించింది. హేమచంద్ బృందం ప్రథమ స్థానంలో నిలవగా ఆయాన్ టీం ద్వితీయ స్థానంలో నిలిచింది ఉత్తమంగా ప్రదర్శించిన విద్యార్థులు హేమచంద్, ఆయాన్, షాహిద్, శాంతివర్ధన్, దుర్గేష్, రాము, బాషా, రోహన్, మణికంఠ, మనోజ్, వరుణ్‌లను ఉపాధ్యాయులు నరసారెడ్డి, శేషుకుమార్, నర్సింహారావు, వెంకటేష్ అభినందించారు.



డ్రామా ప్రదర్శిస్తున్న మూడోతరగతి విద్యార్థులు

ఛలో ఢిల్లీకి భారీగా తరలిరండి

సత్తుపల్లిరూరల్, జూలై25: ఎస్సీవర్గీకరణ సాధనే లక్ష్యంగా వచ్చేనెల 9న జరప తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. గురువారం సత్తుపల్లిలో ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేకల వెంకటేశ్వర్లు, ఆళ్ల్లదాసరి నాగరాజు, మేడుగు లక్ష్మీనారాయణ, చెల్లిముంత దిలీప్, కోట మారుతి, దుర్గారావు, వేల్పుల జానీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాలు,పెన్నులు పంపిణీ

ఏన్కూరు,జూలై25: మండలంలోని రేపల్లెవాడ పాఠశాలలో గురువారం ఆగ్రామ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జన్మదినం సందర్భంగా నోటుపుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ నాయకులునిమ్మల నాగేశ్వరరావు, నిమ్మల నరేందర్, బానోతు తేజ, సాయిన్న వీరబాబు పాల్గొన్నారు.

జేజేసీలో కొత్త భవనాలు నిర్మించాలి

వైరా, జూలై 25: వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసి కొత్త భవనాలను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కాలేజీలో ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శిథిలావస్థలో ఉన్న భవనాలను సందర్శించి పరిశీలించారు. ఆతర్వాత అందోళన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్‌కుమార్, నాయకులు పాసంగులపాటి హేమంత్, నవీన్, సాయి, పాషా, రాము, కృష్ణ, రవి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ప్రారంభం

సత్తుపల్లిరూరల్, జూలై25: మునిసిపాలిటీ పరిధిలోని 23వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్టు మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వార్డుకు రూ.లక్ష చొప్పున ప్రత్యేక నిధులతో చెత్త సేకరణ, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో డోజర్ సహాయంతో పిచ్చిమొక్కల తొలగింపు, డ్రైనేజీలలో పూడికలు తీయడం, బుష్ కటింగ్, ఇంటింటి చెత్త సేకరించే పనులను నెలరోజుల పాటు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ

వైరా, జూలై 25: వైరా మునిసిపాలిటీలో గురువారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా కమిషనర్ సీహెచ్.వేణు ఆధ్వర్యంలో వైరాలోని 20వార్డుల్లో ఇంటింటికి పలురకాల మొక్కలను మునిసిపల్ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ మొక్కలు నాటి సంరక్షించాలని పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంబైపాస్‌రోడ్, జూలై25: జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి బడ్జెట్‌లో నిధులు సాధించలేక పోయారనిబీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. నగరంలోని జడ్పీసెంటర్ వద్ద గురువారం రాష్ట్రప్రభుత్వం దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దగ్ధంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, రుద్రప్రదీప్, మందా సరస్వతి, చంద్రశేఖర్, దావా కిరణ్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, నెల్లూరి కోటేశ్వరరావు, వీరభద్రం, వెంకట్, పాల్గొన్నారు.

అపార్టుమెంట్ కమిటీ వనమహోత్సవం

ఖమ్మంకార్పొరేషన్,జూలై25: నగరంలోని 53వ డివిజన్ గట్టయ్యసెంటర్‌లోని శ్రీనిలయం అపార్టుమెంట్‌లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అపార్టుమెంట్‌వాసులతో కలిసి మొక్కలు నాటారు.

పాఠశాలలో భోజనం తనిఖీ

కారేపల్లి,జూలై25: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం తహసీల్దార్ ఎస్. సంపత్ కుమార్ భోజనం తనిఖీచేశారు. విద్యార్థినులతో మాట్లా డారు. పాఠశాలలోకి కోతులు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై25: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు కాకతీయ యూనివర్సిటీ అమోదంతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2024-24 విద్యాసంవత్సరం నుంచి పదుసంవత్సరాలు స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదాను కల్పించింది. కళాశాల చైర్మన్ ఎం నిరంజన్ రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాలోనే ప్రథమ డిగ్రీకళాశాలల్లో ఒక్క కవిత మెమోరియల్‌కే ఈ హోదా కలిగి ఉందన్నారు. 1991 లో కళాశాలను ప్రారంభించామని, 2021లో నాక్ గ్రేడింగ్ సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవి రమణారావు, కృష్ణమూర్తి అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూవోకు సంక్షేమాధికారుల సన్మానం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 25: ఖమ్మం సాంఘిక సంక్షేమశాఖ ఏఎస్‌డబ్ల్యూవోగా ఏడేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్లిన శ్రీలతను తెలంగాణ సంక్షేమ దినాల సంఘం జిల్లా అధ్యక్షుడు కొటపాటి రుక్మారావు ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం ఖమ్మంలో ఏఎస్ డబ్ల్యూ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా జిల్లా వ్యాప్తంగానసంక్షేమాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమశాఖలో పనిచేసే ఉద్యోగులు సేవా భావంతో ఉండాలని పిలుపునిచ్చారు. సంక్షేమాధికారులు ఎస్ నాగే శ్వరరావు, ఎం.వీరయ్య అబ్దుల్‌రహీమ్, కొత్త వెంకటేశ్వర్లు, మురహరి, ఎస్.వెంకటరెడ్డి, స్టాలిన్, విజయ, విజయలక్ష్మీ, కోమలి, అబ్దుల్ సత్తార్, వినోద, మాధవి, వరలక్ష్మీ, నాగరాజు, అన్వర్, ఓదెలు, రాజా, శ్రీధర్, బాలకృష్ణ పాల్గొన్నారు.



ఏఎస్‌డబ్ల్యూవోను సన్మానిస్తున్న సంక్షేమాధికారులు